బాలీవుడ్ బ్లాక్ అండ్ వైట్ జమానాలో మేలిమి రత్నాల్లాంటి చిత్రాలు ఎన్నో వచ్చాయి! అందులో దర్శకుడు, నిర్మాత, నటుడు గురుదత్ నగిషీలు చెక్కిన వజ్రపు తునకలు కొన్ని. వాటిలో చూసే కొద్దీ చూడాలనిపించే జాతిరత్నం 'ఆర్ పార్'. గురుదత్ ట్రాజెడీ మూడ్‌లోకి రాకముందు తీసిన ఈ చిత్రం ఇప్పటికి సరిగ్గా 70 ఏండ్ల కిందట 1954 జూలైలో విడుదలైంది. సాదాసీదా కథ. సహజమైన నటన. అయినా 'ఆర్ పార్' అదరగొట్టింది. ఎందుకంటే..

# ఆర్.. పార్.. సెవెంటీ ఇయర్స్



**బాలీవుడ్ ఖజానా**



**రివైండ్**





ఓ యాక్సిడెంట్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తుంటాడు ట్యాక్సీ డ్రైవర్ కాలూ (గురుదత్). అతని సత్ప్రవర్తన కారణంగా రెండు నెలలు ముందుగానే ఖైదు నుంచి విముక్తి పొందుతాడు. విడుదలయ్యాక నేరుగా బయటికి వస్తే పోయేది. ఓ సీనియర్ ఖైదీ కాలూ చెవిలో ఏదో ఊదుతాడు. ప్రేక్షకులకూ వినిపిస్తుంది. 'కెప్టెన్ సే మిలోఁ ఔర్ కహో.. కాలే బాదల్ మే బిజిలీ.. బడీ తస్వీర్ సాఫ్ కర్నా హై' అంటాడు వృద్ధ ఖైదీ! కాలూ వీటిని అంతగా పట్టించుకోడనిపిస్తుంది. కారాగారం నుంచి తన అక్క ఇంటికి వెళ్తాడు. జైలుకు వెళ్లొచ్చిన బావమరిదికి ఇంట్లో చోటు లేదంటాడు అక్కమొగుడు. కాలూ రోడ్డుకొస్తాడు. కథానాయిక నిక్కీ (శ్యామా) పరిచయం అవుతుంది. అది స్నేహంగా మారుతుంది. ప్రేమగా మొగ్గ తొడుతుంది. నిక్కీ నాన్న లాలాజీ కార్ల మెకానిక్. అక్కడ కొలువుదీరుతాడు కాలూ. వీరిద్దరి ప్రేమాయణం బయటపడుతుంది. లాలాజీ కోపంతో ఊగిపోతాడు. కాలూను గ్యారేజీ నుంచి వెళ్లగొడతాడు. వెళ్తూ వెళ్తూ కాలూ 'మై నౌకర్ జరూర్ హూఁ.. లేకిన్ ఇస్‌కా ఏ మత్‌లబ్ నహీ కీ మై సర్ భీ నహీ ఉఠా సక్తా' (నేను పనివాణ్నే. కానీ, దానర్థం నేను తల ఎత్తడానికి కూడా వీల్లేదని కాదు) అని విసిరిన డైలాగ్‌ను.. అప్పట్లో ముంబయిలోని ట్యాక్సీవాలాలు జపం చేసినంత పని చేశారట.

ప్రేయసికి దూరమైన కాలూ.. జైలు సహచరుడు చెప్పిన కెప్టెన్‌ను కలవడానికి వెళ్తాడు. ఆ వృద్ధ ఖైదీ చెప్పిన విషయాన్ని కెప్టెన్‌తో పంచుకుంటాడు. కెప్టెన్ అండ్ కో పెద్ద దొంగలముఠా అని వారి వ్యవహారం చూడగానే కనిపెడతాడు కాలూ. సమయం కోసం వేచి చూస్తుంటాడు. వాళ్లతో కలిసినట్టే ఉంటాడు. మరోవైపు తన ప్రేమను దక్కించుకునే ప్రయత్నం చేస్తుంటాడు. చివరికి దొంగలముఠాను పోలీసులకు అప్పగిస్తాడు. నిక్కీ తండ్రిని ఒప్పిస్తాడు. ఆమె ప్రేమను గెలుచుకుంటాడు.

సింపుల్ కథ. పెద్దగా ట్విస్టుల్లేవ్. కానీ, విపరీతంగా ఆడిందీ చిత్రం. కామెడీ, సస్పెన్స్ కావడం ఒకటే సినిమాకు బలం కాదు. గురుదత్ మార్క్ టేకింగ్ 'ఆర్ పార్'కు అపార విజయాన్ని కట్టబెట్టింది. రూ.30 లక్షల బడ్జెట్‌తో తీసిన సినిమా ఓవర్‌సీస్ కలెక్షన్లు కలుపుకొంటే ఏకంగా రూ.1.60 కోట్ల వసూళ్లు రాబట్టింది. సన్నివేశాల రూపకల్పన, కథనం ఈ రెండూ చిత్ర విజయానికి దోహదం చేశాయి. ఈ సినిమాలో ముంబయి వీధులను చూపించిన తీరు, బ్యాంకు లూటీకి రెక్కీ చేయడం, కార్ల చేజింగ్ ఇవన్నీ అప్పటికి కొత్తే! లాంగ్, కార్నర్, లో యాంగిల్ షాట్లు... ఇలా కెమెరామెన్ వీకే మూర్తి సినిమాటోగ్రఫీ 1954 నాటి ప్రేక్షకులకు ఏదో వింత చూస్తున్న అనుభూతి పంచింది. ఇక ఓపీ నయ్యర్ సంగీతం 'ఆర్ పార్' గీతాలను పదేపదే వినేలా చేసింది. ఆ పాటలు కూడా అదేపనిగా పాడుకునేలా గుర్తుండిపోయాయి. నయ్యర్ సంగీతానికి మజ్రూ సుల్తాన్‌పురీ సాహిత్యం తోడవ్వడంతో... 'ఆర్ పార్' గీతాలు ఎవర్‌గ్రీన్ లిస్ట్‌లో పదికాలాలు నిలిచిపోయాయి. 70 ఏండ్ల 'ఆర్ పార్'ను ఒకసారి చూస్తే నవ్వుకుంటారు. రెండోసారి చూస్తే ఆనందిస్తారు. వీలుచూసుకొని మూడోసారీ చూడండి.. ముచ్చటపడతారు. ట్రాజెడీ గురుదత్‌లో ఇంత కామెడీ టైమింగ్ ఉందా అని ఆశ్చర్యపోతారు. ■

## చెయ్యిచ్చిన దిలీప్

'ఆర్ పార్' తర్వాత రెండేండ్లకు 'ప్యాసా' నిర్మాణానికి పూనుకున్నాడు గురుదత్. అందులో లీడ్‌రోల్ పోషించాడు. కొంతభాగం షూటింగ్ కూడా చేశాడు. ఓ సన్నివేశంలో తను అనుకున్న ఎక్స్‌ప్రెషన్ ఇవ్వలేకపోతున్నానని భావించాడు. ఈ పాత్రకు తనకన్నా దిలీప్‌కుమార్ అయితే మరింత న్యాయం జరుగుతుందని ఫిక్సయ్యాడు. దిలీప్‌ని కలిసి 'ప్యాసా' కథ చెప్పాడు. అతనికి నచ్చింది. లక్షన్నర పారితోషికం అడిగాడు. సినిమా రీ షూట్ చేయాల్సి వస్తుందనీ, అంత ఇచ్చుకోలేనన్నాడు గురుదత్. రెమ్యునరేషన్ కింద సినిమా పంపిణీ హక్కులు ఇవ్వమన్నాడు దిలీప్. 'నేను నటుడి కోసం వచ్చాను, డిస్ట్రిబ్యూటర్ కోసం కాదు' అని కచ్చితంగా చెప్పాడు గురుదత్. చర్చోపచర్చల తర్వాత దిలీప్ ఓకే అన్నాడు. రీ షూట్‌కు ముహూర్తం ఫిక్సయింది. లొకేషన్‌లో అందరూ దిలీప్‌కుమార్ రాకకోసం ఎదురుచూడసాగారు. ఆయన ఎంతకూ రాలేదు. ఇంటికి మనిషిని పంపిస్తే అక్కడ లేడు. దర్శకుడు బీఆర్ చోప్రా ఇంట్లో 'నయాదౌర్' సినిమా చర్చల్లో ఉన్నాడని తెలిసి అక్కడికీ మనిషిని పంపాడు గురుదత్. పది నిమిషాల్లో వస్తానని జవాబు పంపాడు. గంట గడిచినా రాలేదు. ఇక లాభం లేదనుకొని 'ప్యాసా'లో తనే కొనసాగాలని గురుదత్ నిర్ణయించుకున్నాడు.

## అన్నీ హిట్టు పాటలే

- కభీ ఆర్ కభీ పార్– శంషాద్‌బేగం
- సున్ సున్ సున్ జాలిమా– రఫీ, గీతాదత్
- బాబూజీ ధీరే చల్‌నా– గీతాదత్
- జా జా జా జా బేవఫా– గీతాదత్
- అరే నా నా తౌబా తౌబా మే నా ప్యార్ కరూంగీ– రఫీ, గీతాదత్